🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☏ : 9701293231

చాళుక్య ద్వారము

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 31 | 29-04-2024 | పుటలు : 4


# ఘనంగా నన్నయ యూనివర్సిటీ ఫౌండేషన్ డే






ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫౌండేషన్ డే వేడుకలను సోమవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఫౌండేషన్ డే సందర్భంగా వికసిత్ భారత్ థీమ్ కార్యక్రమాలను వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుండి 10.30 వరకు శ్రీరాపర్తి రామ ఇన్సిట్యూట్ ఆఫ్ కానవరం వారిచే ఆరోగ్యవంతమైన జీవనంలో యోగ పాత్రను వివరించి యోగాసనాలు వేయించారు. 11.30 నుండి 1.00 వరకు వికసిత్ భారత్ ఏ2047 థీమ్ ఓరియెంటెడ్ డ్యాన్స్, మైమ్, స్కిట్స్ లను క్యాంపస్ విద్యార్థులు మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించారు. 2.30 నుండి4.00 గంటల వరకు జరిగిన వర్క్ షాప్ లో రిటైర్డ్ చీఫ్ సైంటిస్ట్ సి.ఎస్.ఐ.ఆర్. నేషనల్ ఫిజికల్ ల్యాబరేటరీ డా.జి.భగవాన్ నారాయణ రీసెర్చ్ మెథడాలజీ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తో ఉపన్యసించారు. 4.00 నుండి 5.30 వరకు ఫౌండేషన్ డే ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఫౌండేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి నన్నయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఆవిర్భావానికి కృషి చేసిన మహనీయలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత విద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విశ్వవిద్యాలయం 17 వసంతాలు పూర్తి చేసుకొని 18వ వసంతంలోనికి అడుగుపెట్టిందని శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేసిన పూర్వ ఉపకులపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలో రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో భవన, రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. పి.ఎం.ఉషా నుండి రూ.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు.ఖేలో ఇండియాలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మణాలు జరుగుతున్నాయన్నారు. ప్రముఖ సంస్థలతో ఎంవోయూ లు కుదుర్చుకున్నామని విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు. 2047 నాటికి భారతదేశంలో దాదాపు 25- 40 సంవత్సరాల వయస్సులో అత్యధిక యువ జనాభా ఉంటుందన్నారు.దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యువ జనాభా కీలకపాత్ర పోషిస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా వికసిత్ భారత్ 2047 యొక్క విజన్ ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత మరియు సుపరిపాలనతో సహా అభివృద్ధి యొక్క వివిధ అంశాలపై దృష్టి సారించిందని తెలియజేసారు. వికసిత్ భారత్ విజన్‌ని ప్రోత్సహించడానికి 11 థీమ్స్ తో ప్రోగ్రామ్స్ నిర్వహించాలని యూజీసీ భారతదేశంలో ప్రముఖ విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. యూజీసీ సూచించిన వికసిత్ భారత్ 2047 ప్రోగ్రామ్స్ ను నన్నయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలలో విజయవంతంగా నిర్వహించామన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన, అవుతున్న అందరికి వీసీ శుభాకాంక్షలు తెలియజేసారు.





విశిష్ట అతిథి సి.టి.ఆర్.ఐ. డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ పేరుతో విశ్వవిద్యాలయం ఆవిర్భవించడం గోదావరి వాసులకు వరమన్నారు. నన్నయ, కందుకూరి వంటి మహనీయులు నడయాడిన నేలపై యువతరం నేడు విద్యను అభ్యసిస్తున్నారని గుర్తు చేసారు. నన్నయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ లక్ష్యాలను నెరవేర్చే వారిగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. సి.టి.ఆర్.ఐ. నన్నయ యూనివర్సిటీ మధ్య ఉన్న అవగాహన ఒప్పంద ప్రయోజనాలను తెలియజేసారు. నన్నయ యూనివర్సిటీ యూజీసీ విక్షిత్ భారత్ జాబితాలో ఉండటం హర్షనీయమన్నారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు జ్యోతులుగా ఇతరులకు వెలుగును పంచాలని సూచించారు.

రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఎర్త్ డే, యూనివర్సిటీ ఫౌండేషన్ డే, వీసీ ఆచార్య పద్మరాజు బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. వీసీ పద్మరాజు నాయకత్వంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూ లు కుదుర్చుకొని విద్య, పరిశోధన, ప్రాజెక్టులలో భాగస్వామ్యం చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీలో చాలా కాలంగా నిలిచిపోయిన భవనాలను పునరుద్ధరించడంలో వీసీ పద్మరాజు ఎంతో కృషి చేసి భవన నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డా.ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ అభివృద్ధిలో వీసీ పద్మరాజుకు ముందు వీసీ పద్మరాజుకు తరువాత అని చెప్పే విధంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంతో పట్టుదలతో యూనివర్సిటీలో భవన నిర్మాణాలు చేపట్టారని ప్రశంసించారు. వీసీ కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఎస్.వి.కె.పి.అండ్ కె.ఎస్.రాజు కాలేజీ పెనుగొండ కరస్పాండెంట్ డా.రామచంద్రరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పాటులో గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి చేసిన కృషిని వివరించారు.

సెయింట్ థెరిస్సా కాలేజ్ ఏలూరు ప్రిన్సిపాల్ డా.మెర్సీ నన్నయ యూనివర్సిటీని వీసీ పద్మరాజు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అభినందించారు. మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

వై.ఎన్.కాలేజ్ నరసాపురం కరస్పాండెంట్ డా. చినమిల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఎంతో కృషి ఫలితంగా నన్నయ యూనివర్సిటీ ఏర్పాటు అయిందని, భారతదేశంలో ఉన్నత యూనివర్సిటీగా నన్నయ యూనివర్సిటీని తీసుకువెళ్ళాలని ఆకాంక్షించారు.

సి.ఆర్.ఆర్. కాలేజ్ ఏలూరు డా.రామరాజు మాట్లాడుతూ పి.ఎం.ఉషా పథకంలో రూ.20 కోట్లు నిధులు తీసుకురావడం హర్షనీయమని వీసీ పద్మరాజు ను అభినందించారు.ఈసీ మెంబర్ డా.జ్యోతి, ఆదిత్య డైరెక్టర్ డా.సుగుణ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎక్కువ అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెద్ద యూనివర్సిటీగా ఉందన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, అకడమిక్ డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఆవిర్భావ వికాసాలను తెలియజేసారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలలు నాక్ గుర్తింపును సాధించాలని తెలియజేసారు. ఫౌండేషన్ డే సందర్భంగా యూనివర్సిటీ కూచిపూడి డిప్లొమా మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం నాక్ ఏ ప్లస్, ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ లను సాధించిన అనుబంధ డిగ్రీ కాలేజీలకు విశ్వవిద్యాలయం తరపున అభినందన సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే విక్షిత్ భారత్ ప్రోగ్రామ్ మరియు ఫౌండేషన్ డే ప్రోగ్రామ్ లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు సర్టిఫికెట్టులను అందజేసి అభినందించారు. నన్నయ యూనివర్సిటీ తరపున జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరచిన క్రీడ్షాకారులకు నగదు బహుమతిని, సర్టిఫికెట్లను అందించి అభినందించారు. అనంతరం వీసీ ఆచార్య పద్మరాజు పుట్టిన రోజు సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కేక్ లను కట్ చేసి వీసీ పద్మరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.
















# సంపాదకీయం



# నృత్యం

## (ఏప్రిల్ 29 ప్రపంచ నృత్య దినోత్సవం)

*మన భారతీయ నాట్యం ఆర్ష సంప్రదాయ సంస్కృతీ సంపన్నం. ఒంటికి వ్యాయామం. సంపూర్ణ ఆరోగ్యం. ప్రేక్షకులకి,సామాజికులకి ఆనందాల ఆమెత. ఒక సౌందర్య నిధానం! ఒక అనిర్వచనీయ రసానంద తన్మయత్వం! పారవశ్యం! ఒక ఈస్తటిక్ ఎక్స్పీరియన్స్!! ఆ రసం బ్రహ్మానంద సబ్రహ్మచారిణి!!*

*సృష్టి అంతా ఒక అఖండ చలనం. విశ్వమంతా ఒక నర్తనం. పరమాణు కేంద్రకాన్ని పరివేష్టించి ఎలక్ట్రాన్స్ చేసేదీ నర్తనమే. మానవజాతి అస్తిత్వం ఎంత ప్రాచీనమయిందో నర్తన కళ కూడా అంతే ప్రాచీనమైంది. భారతీయ నాట్యశాస్త్ర కర్త అయిన భరతముని నర్తనానికి నాలుగు ఉపాంగాలు అవసరమన్నారు. ఆంగికం,వాచికం,ఆహార్యం, సాత్త్వికం. శరీర అవయవాల కదలిక వలన కలిగే రస స్ఫురణ ఆంగికం.మాటల ద్వారా స్ఫురింప చేయటం వాచికం.వేషధారణ ఆహార్యం. ముఖం,కన్నుల హావభావాల ప్రదర్శన సాత్త్వికం. ఈ ఉపాంగాలన్నీ నటరాజగు శివుని అంతర్భాగాలు.*

*ఏ చినుకు కురిసినప్పుడో, ఏ మబ్బు ముసిరినప్పుడో ఆదిమానవుడు ఆనందంతో ఓ కేక పెట్టి ఓ చిందువేసి ఉంటాడు. ఆ చిందు లయానుగతమై, లయ జతిగామారి నృత్తమై, నృత్యమై, నాట్యమై,లాస్యమై తాండవమై తరతరాలుగా రసజ్ఞ సమ్మోహనంగా లోకాలకు తన్మయత్వం కలిగిస్తూనే ఉంది.*

*ఆ కేక స్వరమై,రాగమై,వర్ణమై,*
*సంగీతమై,శాస్త్రమై రసానంద సాగరమై రసజ్ఞ లోకాన్ని ముంచెత్తుతోంది.*

*విశ్వాన్ని నాట్యమయంగా, శివ మయంగా చూపించి మానవుణ్ణి విశ్వమానవుణ్ణి చేస్తున్నది. దృష్టి పరిధిని సృష్టి కొసలకు విస్తరించే లోచూపు అనుగ్రహిస్తుంది. నృత్య కళాసరస్వతి సాక్షాత్కారం బ్రహ్మానందానుసంధాయకం అనీ తద్వారా మోక్ష సాధకమనీ భారతీయుల పారమార్థిక దృష్టి.*

*పంచభూతములు ముఖపంచకమై, ఆరు ఋతువులు ఆహార్యములై, ప్రకృతి పార్వతి నీతో నడచిన ఏడు అడుగులే స్వరసప్తకమై... చంద్రకళాధర సహృదయా! సాంద్రకళా పూర్ణోదయ లయ నిలయా!!.. అని శ్రీ వేటూరివారు నాటరాజార్చన చేశారు. భావములో,భంగిమలో,గానములో,గమకములో, ఆంగికమౌ తపమీ గతి సేయగ... కైలాసాన కార్తీకాన శివరూపం, ప్రమిదే లేని ప్రమదాలోక హిమ దీపం!*

*తపమని కిరణం, తామస హరణం, శివుని నయనత్రయ లాస్యం!*
*"జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ!"*

*సత్యమై, నిత్యమై వెలిగే ఈశ్వర తత్వంలో పరమాత్మ తాండవం! అదే జ్ఞానవాహిని అయిన సాగర సంగమం!! ఆయనే నటరాజ స్వామి. నమక చమక సహజం - నట ప్రకృతీ పాదజం! నర్తనమే శివ కవచం - నటరాజ పాద సమరజం!! నాదవినోదము, నాట్య విలాసము పరము సుఖము పదము! అభినయ వేదము సభకనువాదము సలుపు పరము పదము!!*

*తాండవం - ఉద్ధృత నాట్యం, అది ఈశ్వరునిది! లాస్యం - సుకుమారమైన నృత్యం, అది పార్వతీదేవిది!!*
*తండు మహర్షి వలన భరత ముని నేర్చినది తాండవం!*
*చూశారా... ఇదంతా మహర్షుల వ్యవహారం. అందుకే నాట్యం 'తపస్సు' అయింది.*

# నన్నయలో ఖేలో ఇండియా ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ విజిట్





ఆదికవి నన్నయ యూనివర్సిటిలో ఖేలో ఇండియా వర్క్స ను పరిశీలించడానికి యువజన, క్రీడా మంత్రిత్వశాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు హాజరయ్యారు. బుధవారం యూనివర్సిటీలోని ఖేలో ఇండియా నిధులతో జరుగుతున్న రూ. 8.30 కోట్లతో నిర్మాణంలోనున్న మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించారు. ఖేలో ఇండియా ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ పి రామకృష్ణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, కమిటీ సభ్యులు యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ రజత్ చౌహాన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పి.సతీష్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎస్ వి రమణ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇంజనీర్ కె నూకరత్నం హాజరై నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య కె పద్మరాజు ను కలిసి ఖేలో ఇండియా నిధుల ద్వారా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పనుల పురోగతిపై చర్చించారు. నిర్మాణంలోనున్న మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వీసీ తెలియజేశారు. గోదావరి జిల్లాలోని క్రీడా పోటీలకు జాతీయస్థాయి వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ఖేలో ఇండియాలో మంజూరైన నిధులను విడుదల చేసి నాణ్యమైన నిర్మాణాలను అందజేయాలని వీసీ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఖేలో ఇండియా ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ బృందం ప్రస్తుతం పరిశీలించిన నిర్మాణ పనులపై నివేదిక సమర్పించి మంజూరైన నిధులు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డి.ఎస్.డి.ఓ. డి ఎం ఎం శేషగిరి, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ అధ్యాపకులు పాల్గొన్నారు

# ఏపీ సెట్ నిర్వహణపై వీసీ సమీక్ష



రాజమహేంద్రవరం పరిధిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్స్ తో వీసీ ఆచార్య కె.పద్మరాజు సమీక్ష నిర్వహించారు. గురువారం యూనివర్సిటీ ఈసీ హాల్లో నిర్వహించిన సమావేశంలో వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఈనెల 28 న ఏపీ సెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం పరిధిలో 7వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలోని 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామని, చీఫ్ సూపరింటెండెంట్ లు, అబ్జర్వర్స్ పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు పేపర్ 1 పేపర్ 2 పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్లు సూచించిన నిబంధనలు పాటిస్తూ పరీక్షలు రాసే అభ్యర్థులు ఉదయం 8:30 కి పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ మెంబర్ గా వీసీ పద్మరాజు వ్యవహరిస్తున్నారని, వారి పర్యవేక్షణలో రీజినల్ పరిధిలో ఏపీ సెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు,అసిస్టెంట్ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ క్యాంపస్ లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



కాకినాడ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ లో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ 31 వ వార్షికోత్సవ దినోత్సవం నిర్వహించారు. విభాగ కోర్స్ కో-ఆర్డినేటర్ డా.కే.జోసెఫ్ స్టీఫెన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. ప్రశాంతిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు ప్రభుత్వం కల్పించిన 29 అధికారాలు, విధులను బదిలీ చేయడం ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేయవచ్చని అన్నారు. గ్రామ సీమలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని జాతిపిత గాంధీజీ పిలుపునిచ్చారని అన్నారు.గ్రామాల అభివృద్దే మన దేశాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ సహాయాచార్యులు మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డా.కే.హరిబాబు 73వ సవరణ చట్టంలోని విశేషాలను వివరించారు. స్థానిక సంస్థల ప్రాధాన్యతను విభాగ సహాయ ఆచార్యులు మరియు మెన్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ ఎం. గోపి తెలియజేశారు, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.





## ఎంసీఏ ఫేర్వెల్ పార్టీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఘనంగా ఫేర్వెల్ పార్టీని ఇచ్చారు. ఎంసీఏ పూర్తి చేస్తున్న విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని అధ్యాపకులు సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

## మంచిమాట

గొప్ప నృత్యకారులు వారి సాంకేతికత కారణంగా గొప్పవారు కాలేదు.వారి అభిరుచి,తృష్ణ కారణంగానే వారు గొప్పవారయ్యారు.

Great Dancers are not great because of their technique,they are great because of their passion.

— Martha Graham



## వీసీ పద్మరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

ఏప్రిల్ 22 ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవంతో పాటు ప్రస్తుత ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు పుట్టినరోజు కావడం మరో విశేషం. విసి పద్మరాజుకు విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అనుబంధ కళాశాలల యాజమాన్యాలు శుభాకాంక్షలు తెలియజేశారు.
























# నాట్యం - నృత్యం
# ఆనందం - ఆరోగ్యం

భారతీయ 64 కళలలో నాట్యం ఒకటి. ఈ నాట్యం లో అంతర్భాగమే నృత్యం. నాలుగు వేదాల సరసన పంచమ వేదం సారంగా ఈ నాట్యానికి గౌరవం ఉంది. నాట్యంతో దైవాన్ని సైతం దర్శించవచ్చు. భరతమునిని ఈ నాట్యకళకు ఆద్యుడుగా చెప్పవచ్చు. ఋగ్వేదం నుండి పాఠ్యాన్ని ,యజుర్వేదం నుండి అభినయాన్ని, సామవేదం నుండి సంగీతాన్ని, అథర్వణ వేదం నుండి రసాన్ని గ్రహించి నాట్య వేదాన్ని సృష్టించారు. అంగీకం, వాచికం, ఆహార్యం, సాత్వికం అను 4 ఉపాంగాలు నాట్యానికి ప్రాణాలు. కాలచక్రం అనే వృత్తంలో కాలే అగ్నిశిఖను చేతపట్టుకొని మరొక చేత ఢమరుక ధ్వని వినిపిస్తూ చెలరేగి ఆడే నటరాజ భంగిమ సృష్టి రహస్యాన్ని వివరించే అభయమూర్తి అని సనాతనధర్మం వివరిస్తుంది.విశ్వ సృష్టి ఆవిర్భావానికి మూలమైన శక్తిని నిర్వచించే పరమాణు విన్యాసమే నటరాజ భంగిమ అని తెలుసుకొని జెనీవాలోని అణు పరిశోధన సంస్థ ముందు నిలువెత్తు నటరాజ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది.మన దేశం నృత్య కళలకు పుట్టినిల్లు.కూచిపూడి, భరతనాట్యం,కథక్, కథాకళి, మొహిని ఆట్టం,మణిపూరి,ఒడిస్సీ వంటి నాట్యరీతులు,బుర్రకథ,తోలు బొమ్మలాట, యక్షగానం, పేరిణి, కోలాటం, థింసా వంటి నృత్యరీతులు ఉన్నాయి. 30 నిమిషాల డ్యాన్స్..ఓ రోజు జాగింగ్ సెషన్‌తో సమానం కాబట్టి డ్యాన్స్ అనేది కళారూపం మాత్రమే కాదు. ఇది మన మొత్తం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ట్యాప్ డ్యాన్స్ అనేది మీ కాళ్ళను టోన్ చేయడంలో, కండరాల బలాన్ని అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. హృదయరోగాలను దూరం చేస్తుంది.బెల్లీ, జుంబా, ఏరోబిక్స్,సల్సా వంటి నృత్యాలు మీ మొత్తం శరీరం, కండరాలను టోన్ చేయడంలో సహాయ పడతాయి.భరత నాట్యం ఆరోగ్యకరమైన హృదయాన్ని అందించడంలో సహాయం చేస్తుంది. అంతేకాకుండా ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. ఓర్పును, రక్త ప్రసరణను పెంచుతుంది. మీ బరువును అదుపులో ఉండేలా చేస్తుంది. కథాకళి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడమే కాకుండా కంటికి సంబంధించిన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.రోజూ డ్యాన్స్ చేస్తే మీ జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పెద్దయ్యాక వచ్చే మతిమరపు నుంచి దూరం చేస్తుంది. ఎందుకంటే డ్యాన్స్ అంటే ఆహ్లాదమే కాదు ఆరోగ్యం కూడా.

**బి.సుశాంత్ కుమార్**

## ఏపీ సెట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన వీసీ



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ పద్మరాజు

రాజమహేంద్రవరం పరిధిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ పరీక్షా కేంద్రాలను వీసీ ఆచార్య కె. పద్మరాజు పరిశీలించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్ కే వి టి, ఎస్ కే ఉమెన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు అందించారు. దీనికి సంబంధించిన వివరాలు వీసీ తెలియజేస్తూ రాజమహేంద్రవరం పరిధిలో 6854 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5452 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలోని 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామని, చీఫ్ సూపరింటెండెంట్ లు, అబ్జర్వర్స్ పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు, అసిస్టెంట్ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి తదితరులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

















## నటరాజార్చన



ఒక ఏడాది డిప్లమా కోర్స్ గా కూచిపూడి మొదటి బ్యాచ్ విజయవంతమైనందుకు సంతోషంగా ఉంది. నాటి ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుగారు విశ్వవిద్యాలయంలో లలిత కళలకు సంబంధించిన కోర్సులు ఉండాలని, కూచిపూడి డిప్లమో కోర్స్ ని ప్రారంభించాలని అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ ఎంతో ప్రేరణనిచ్చారు. దానికి డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి. జ్యోతిర్మయిగారు తమ పూర్తి సహకారాన్ని అందించారు. 2023 అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా కోర్సును ప్రారంభించాం. 22 సీట్ల పరిమితితో ఈ కోర్సులో విద్యార్థులు ప్రవేశించి వారానికి మూడు రోజులు సాయంత్రం తరగతులకు హాజరవుతూ కూచిపూడిని అభ్యసించి అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో విజయవంతమైన ప్రదర్శనలు చేశారు. రాబోయే రోజుల్లో ఈ కోర్సుపట్ల ఆసక్తి ఉన్న మహిళలకు, విద్యార్థినులకు యూనివర్సిటీ వేదికైనందుకు సంతోషిస్తూ ఈ కోర్సును విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మాన్య ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజుగారికి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ గారికి, ప్రిన్సిపాల్ ఆచార్య డి. జ్యోతిర్మయిగారికి మరియు విశ్వవిద్యాలయ అధికారులకు, విద్యార్థులకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**కడలి శ్రీరాజరాజేశ్వరిదేవి కోఆర్డినేటర్ కూచిపూడి డిప్లమో కోర్స్**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

## కళల కాణాచి



ఆంధ్రప్రదేశ్ కళల రాజధాని రాజమహేంద్రవరం. చారిత్రక నగరం. ఆదికవి నన్నయ పేరుతో విలసిల్లుతున్న విశ్వవిద్యాలయంలో కళలను ప్రోత్సహిస్తూ పరిసర ప్రాంతాల విద్యార్థులకు కూచిపూడి నృత్యాన్ని నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న విద్యార్థులకు డిప్లమో కోర్సులు అందించటం ఆనందదాయకం. ఈ కోర్సులో చేరడానికి నృత్యం నేర్చుకోవాలన్న ఆసక్తి కలిగిన విద్యార్థినులు, ఉద్యోగం చేసుకుంటున్న మహిళలకు సదవకాశం కల్పిస్తూ పార్ట్ టైం కోర్సుగా సాయంత్రం సమయంలో తరగతులు నిర్వహిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మొదటిసారిగా ఈ కోర్సులో 22 మంది విద్యార్థులు జాయినై విజయవంతంగా పూర్తి చేశారు. ఎన్నో కార్యక్రమాల్లో చాలా మంచి ప్రదర్శనలను ఇచ్చారు. దీనిని అవసరమైతే పూర్తిస్థాయిలో అందించడానికి కూడా ప్రయత్నం చేస్తాం. ఇటువంటి కళను నేర్చుకోవడం వలన విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం, శారీరక మరియు మానసిక ప్రశాంతత లభిస్తుంది కనుక విశ్వవిద్యాలయం అందించే ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకుంటారని నేను భావిస్తున్నాను.

**ఆచార్య డి. జ్యోతిర్మయి**
**ప్రిన్సిపాల్, UCAC**

## అభినందన



విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యానికి సంబంధించిన ఒక కోర్స్ రావటం, దిగ్విజయంగా విద్యార్థులు పూర్తి చేయటం చాలా సంతోషాన్ని కలిగించింది. అంతేకాకుండా ఏడాది పొడవునా అనేక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. లలిత కళలకు సంబంధించిన నృత్యం, చిత్రలేఖనం, శిల్పం... ఇటువంటి కోర్సులు విశ్వవిద్యాలయాల్లో మానసిక ఆనందాన్ని కలిగిస్తాయి. ఈ సందర్భంగా కోర్స్ కోఆర్డినేటర్ కి, విద్యార్థులకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**ఆచార్య కె.పద్మరాజు**
**ఉపకులపతి**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

## శుభాకాంక్షలు..!



భారతీయ లలితకళల్లో నృత్యం ఎంతో ప్రాముఖ్యాన్ని పొందింది. అందులోనూ తెలుగునాట కూచిపూడి ప్రసిద్ధమైనది. సిద్ధేంద్ర యోగి ద్వారా ఈ నృత్యం తెలుగు వారికి ప్రసాదింపబడిన వరం. అటువంటి కోర్సు విశ్వవిద్యాలయంలో నిర్వహించడం, విద్యార్థులు ఎంతో చక్కని ప్రదర్శనలు ఇవ్వడం, విజయవంతంగా మొదటి ఏడాది పూర్తి అవ్వడం ఎంతో గర్వకారణం. సంతోషాన్ని కూడా కలిగించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు కోర్స్ కోఆర్డినేటర్ కి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**ఆచార్య జి.సుధాకర్**
**రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**


















ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in